



క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీస్ సిబ్బంది

ట్రాఫిక్ జామ్.. దారి మళ్లింపు

ఘోర రోడ్డు ప్రమాదంతో చేవెళ్ల మండలం మీర్జాగూడ శివారులో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ప్రమాద తీరును చూసేందుకు వేల సంఖ్యలో జనం అక్కడికి వచ్చారు. దీంతో అటుగా వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో ఎక్కడిక క్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను ఆలూరు గేట్ మీదుగా దారి మళ్లించారు. ఆలూరు, కౌకుంట్ల, ఎన్కెపల్లి మీదుగా తరలించారు. హైదరాబాద్ నుంచి వికారాబాద్, పరిగి వైపు వచ్చే వాహనాలను షాబాద్ వైపు, శంకర్‌పల్లి వైపునకు మళ్లించారు. సాయంత్రం మూడు గంటల తర్వాత రోడ్డు క్లియర్ చేయడంతో యథావిధిగా వాహనాలు తిరిగాయి.

ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు



డెత్ జర్నీ

మీర్జాగూడ వద్ద ఊహకందని విషాదం

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్.. వికారాబాద్ జిల్లాకు చెందిన 15 మంది మృతి

చేవెళ్ల ఆస్పత్రిలో ఆహాకారాలు.. ఆర్తనాదాలు .. కన్నీటి పర్యంతమైన బాధితులు



ఉదయాన్నే కళాశాలలకు వెళ్లాలని విద్యార్థినులు, పిల్లలను ఆస్పత్రికి తీసుకెళ్లాలని తల్లిదండ్రులు, తన కూతురు డోలారోహణం తర్వాత అత్తారింటికి వెళ్తున్న ఓ మహిళ.. డ్యూటీకి ఆలస్యమవుతుందని మరి కొందరు.. ఇలా హడావుడిగా వేకువజామునే వికారాబాద్ జిల్లా తాండూరు బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సెక్కారు. ఇదే చివరి ప్రయాణమని తెలియని వారు పోటీపడి మరీ సీట్లలో కూర్చున్నారు. వెనుక వైపు వద్దంటూ పోటీపడి మరీ ముందు సీట్లలో కూర్చున్నారు. సుమారు ఐదు గంటల సమయంలో బస్సు బయల్దేరింది. కొంత మంది ఫోన్లు చూస్తున్నారు. పలువురు నిద్రలోకి జారుకున్నారు. 6.40 గంటల సమయానికి బస్సు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపానికి చేరింది. మరో గంటన్నర సమయంలో అంతా గమ్యస్థానానికి (హైదరాబాద్‌కు) చేరుకునేవారు. అంతలోనే చేవెళ్ల నుంచి కంకర లోడ్‌తో అతివేగంగా ఓ టిప్పర్ మృత్యువును వెంటబెట్టుకొని తాండూరు వైపునకు దూసుకొస్తోంది. సరాసరి మీర్జాగూడ శివారుకు రాగానే మూల మలుపు వద్ద బస్సును టిప్పర్ ఎదురుగా బలంగా ఢీకొట్టింది. భారీ లోడు, అతివేగం కారణంగా టిప్పర్ అమాంతం బస్సును చీల్చుకుంటూ వెళ్లి ప్రయాణికులపై పడిపోయింది. టిప్పర్‌లోని కంకర కుప్ప ప్రయాణికులను కమ్మేసింది. దీంతో ఊపిరాడక 19 మంది ప్రయాణికులు సజీవ సమాధి అయ్యారు. మరో 34 మంది తీవ్రంగా గాయపడ్డారు. పసిపాపతో సహా తల్లి, బంధువుల పెళ్లికి వచ్చి వెళ్తున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు, ఇద్దరు చిన్నారులను అనాథలను చేస్తూ తల్లిదండ్రులు.. ఇలా చాలా మంది కంకర కుప్పలో కూరుకుపోయి ప్రాణాలు వదిలారు. కొందరి తల మాత్రమే బయటకు కనిపిస్తూ శరీరమంతా కంకరలో మునిగి సాయం కోసం అర్థిస్తున్న తీరు కంటతడి పెట్టించింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద సోమవారం ఉదయం జరిగిన ఈ ఘోర ప్రమాదం రాష్ట్రాన్ని ఉలిక్కిపాటుకు గురి చేసింది. చేవెళ్ల ఆస్పత్రిలో పోస్ట్ మార్టం ముగించి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న తీరు హృదయాన్ని ద్రవింపజేసింది. తల్లిదండ్రులను పోగొట్టుకున్న పిల్లలు, పిల్లలను పోగొట్టుకున్న తల్లిదండ్రులు, భర్తలను కోల్పోయిన భార్యలు, భార్యలను కోల్పోయిన భర్తల రోదనలతో ఆస్పత్రి పరిసరాలు మారుమోగాయి.

మరిన్ని వివరాలు 7లో..

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, (నవంబర్ 3) ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో వికారాబాద్ జిల్లాకు చెందిన 15 మంది మృత్యువాత పడ్డారు. తాండూరు పట్టణానికి చెందిన ఎనిమిది మంది మృతి చెందగా, యాలాల్ మండలం, హాజీపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు, దౌల్తాబాద్, వికారాబాద్, బషీరాబాద్ ప్రాంతాలకు చెందిన ఒక్కొక్కరు మృతి చెందారు. క్షతగాత్రుల్లో 10 మందిని వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో, ముగ్గురిని ప్రైవేట్ మరో ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ప్రమాదంలో తాండూరు పట్టణ ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఖాలీద్ (26), సలేహా బేగం(20), ఆమె కూతురు జహీరా ఫాతిమా(40 రోజుల శిశువు) దుర్మరణం పాలయ్యారు.



మార్చురీ నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న వైద్య సిబ్బంది

యాలాల్ మండలం, పేర్కంపల్లికి చెందిన ముగ్గురు అక్కా చెల్లెళ్లు ఈడిగ నందిని(22), ఈడిగ తనూష(20), ఈడిగ సాయిప్రియ(18), తాండూరు బృందావన్ కాలనీకి చెందిన తబస్సుమ్ జహాన్(38), తాండూరు గౌతాపూర్‌కు చెందిన ముస్కాన్ బేగం(22) కూడా ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. యాలాల్ మండలం, హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు లక్ష్మి(40), బందెప్ప(42) మృతి చెందగా, వారి ఇద్దరు కూతుళ్లు అనాథలుగా మారారు. వికారాబాద్ శ్రీరాంనగర్(ధన్నారం తండా)కు చెందిన బ్రహ్మోవత్ తారీబాయి (44), దౌల్తాబాద్ మండలం నీటూరుకు చెందిన

మిగతా 7వ పేజీలో...

మెరుగైన చికిత్స అందించాలి

వైద్య విద్యా డైరెక్టర్ నరేంద్రకుమార్

వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైద్య విద్యా డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ ఎ.నరేంద్ర కుమార్ పరామర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు క్షతగాత్రుల ఆరోగ్యంపై ఆరా తీశారు. గాయపడ్డ వారిలో ఒక్కొక్కరి ఆరోగ్య పరిస్థితి ఏ విధంగా ఉందనేది అక్కడున్న డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం ఆందోళనకరంగా లేకపోవడంతో ఇక్కడే మెరుగైన చికిత్స అందించాలని ఆయన డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, ఇంకా సమకూర్చాల్సిన సదుపాయాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.



వికారాబాద్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న నరేంద్రకుమార్



దిగ్భ్రాంతికి గురి చేసింది




రోడ్డు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. క్షతగాత్రులకు తక్షణమే వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించాలని ఆదేశించారు.

-స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

అత్తింటికి వచ్చి తిరిగి వెళ్తూ..

తాండూరు పట్టణానికి చెందిన వెంకటమ్మ హైదరాబాద్‌లో భర్తతో కలిసి కూలి పని చేసుకుంటుంటుంది. ఆదివారం సెలవు కావడంతో తాండూరు పట్టణంలోని వాల్మీకి నగర్‌లో ఉంటున్న తన అత్తగారింటికి వచ్చింది. పని నిమిత్తం తిరిగి సోమవారం ఉదయమే బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందింది.





మెజిస్టీరియల్ విచారణకు ఆదేశం



రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం పరంగా అండగా ఉంటామని మంత్రి శ్రీధర్‌బాబు భరోసా ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పరంగా సంతాపం తెలియజేస్తున్నామన్నారు. క్షతగ్రాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. అలాగే మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని స్పష్టం చేశారు.ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారన్నారు. బాధితులకు అందుతున్న వైద్యసేవలు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు మెజిస్టీరీయల్ విచారణకు ఆదేశించడంతో పాటు శాఖాపరమైన విచారణకు సైతం ఆదేశించామని మంత్రి స్పష్టం చేశారు.

-శ్రీధర్‌బాబు, ఐటీ శాఖ మంత్రి

ఘటన దురదృష్టకరం



ఈ రోడ్డు ప్రమాద ఘటన దురదృష్టకరమని వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం ఘటనా స్థలంతో పాటు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వైద్యాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరంగా అదుకుంటామన్నారు.

-దామోదర రాజనర్సింహ, వైద్యారోగ్య శాఖ మంత్రి

బాధితులకు అండగా ఉంటాం



రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రమాద ఘటన స్థలంతోపాటు ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి సందర్శించారు. అనంతరం మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించడం తోపాటు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయిస్తామని తెలిపారు.

-పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ మంత్రి



రోడ్డుపై మృతదేహాలు



చేవెళ్ల ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబీకుల రోదనలు

బతికే ఉన్నా మృతి చెందిందంటూ..

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతి చెందిందని పోలీసులు ఇచ్చిన తప్పుడు సమాచారం ధారూరులో గందరగోళానికి దారితీసింది. ధారూరు ఎస్సీ కాలనీకి చెందిన నాగమణి ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా చేవెళ్లలోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. గాయపడి చికిత్స పొందుతున్న నాగమణి మృతి చెందిందని, మృతదేహాన్ని ధారూరుకు పంపిస్తున్నామని చేవెళ్ల పోలీస్ అధికారి నుంచి ధారూరు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మధ్యాహ్నం వరకు నాగమణి చనిపోయిందనే గ్రామంలో ప్రచారం జరిగింది. ఆమె గురించి తెలుసుకోవాలని కొంతమంది ఫోన్‌లు చేసినా ఆమె ఫోన్ నంబరు కలువలేదు. ఈ గందరగోళంలోనే నాగమణి చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని క్షతగాత్రుల జాబితా సామాజిక మాధ్యమాలలో కనిపించింది. ఇది గమనించిన కాలనీ వాసులు నాగమణి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలుసుకోగా నాగమణి బతికే ఉందని, ఆసుపత్రిలో చికిత్సపొందుతుందని తెలవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



మీర్జాగూడ వద్ద ట్రాఫిక్ జామ్

కీసరగుట్టలో భక్తజన సందోహం

- స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



రామలింగేశ్వర స్వామి సేవల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట భక్త జన సందోహంతో కళకళలాడింది. కార్తీక రెండో సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యల్లో ఆలయానికి తరలివచ్చారు. భక్తుల రద్దీ అంచనా వేసిన ఆలయ నిర్వాహకులు తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వామివారికి అభిషేకాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రామలింగేశ్వర స్వామికి శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం శివలింగాలకు అభిషేకాలు, కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూచిపూడి, భరత నాట్యం భక్తులను ఎంతగానో అలరించాయి.



దర్శనానికి క్యూలో భక్తులు

15వ తేదీన ప్రత్యేక

లోక్ అదాలత్

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న ప్రత్యేక లోక్ ఆదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు వికారాబాద్‌లోని జిల్లా కోర్టు ఆవరణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వాప్తంగా వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ కోర్టుల్లో లోక్ ఆదాలత్ నిర్వహిస్తామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం

- కొడంగల్‌లో అమలుకు ముందుకొచ్చిన 'అక్షయపాత్ర'
- ఎన్కేపల్లిలో 'గ్రీన్‌ఫీల్డ్ కిచెన్'
- భూమిపూజకు సీఎంకు ఆహ్వానం

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చింది. ఈమేరకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి తమ నిర్ణయాన్ని ప్రకటించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ భూమి పూజకు ఈనెల 14వ తేదీన హాజరు కావాలంటూ వారు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌లో వండిన భోజనాన్ని నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు సరఫరా చేయనున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో 312 పాఠశాలల్లో సుమారు 28 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం వేళలో అల్పాహారం అందిస్తున్నారు. అన్ని గ్రామాల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఈ పథకానికి అపూర్వ స్పందన లభిస్తున్న విషయం తెలిసిందే.



సీఎస్ఆర్ నిధులతో మధ్యాహ్న భోజనం

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి రూ.7 వంతున ప్రభుత్వం చెల్లిస్తుండగా, నాణ్యమైన భోజనం అందించేందుకు అక్షర ఫౌండేషన్ రూ.25లు ఖర్చు చేస్తోంది. మధ్యాహ్న భోజనానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే నిధులకు అదనంగా అయ్యే ఖర్చును అక్షయ పాత్ర ఫౌండేషన్ భరించనుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులతో మధ్యాహ్న భోజనం అందించే విధంగా అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది డిసెంబరులో కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన విద్యార్థులకు అల్పాహారం అందించే పథకం విజయవంతంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

'ప్రజావాణి' సమస్యలను పరిష్కరించాలి

- ప్రజల నుంచి 86 దరఖాస్తుల స్వీకరణ
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి 86 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా పెన్షన్, వ్యవసాయం, గృహ నిర్మాణ శాఖ, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరిచాఆలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌ఓ మంగ్లీలాల్, ఆర్డీవో వాసుచంద్ర పాల్గొన్నారు.


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

పేదలకు తోడుగా నిలవాలి

శిక్షణ పొందిన సభ్యులు ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో చురుకుగా పాల్గొని పేద మహిళలకు సహాయ సహాకారం అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల పిల్లలకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా సెంట్రింగ్ వర్క్‌పై ఆరు రోజుల శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు డీఆర్‌డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ సర్టిఫికెట్లు అందించారు. ఎల్‌డీఎం యాదగిరి బ్యాంకు రుణాల మంజూరు గురించి వివరించారు. అనంతరం హౌసింగ్ పీడీ దశరథ్ సెంట్రింగ్ శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. జీఎం డీఐసీ మహేశ్వర్ మాట్లాడుతూ.. పీఎంఈజీపీ ద్వారా రుణాలు, సబ్సిడీలు పొందేందుకు సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం(నాన్‌ఫార్మ్), కొమరయ్య, హౌసింగ్ డివిజన్ ఇంజినీర్లు ఏపీఎం కిష్టప్ప, సీసీ రాములు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

పక్కాగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

పక్కాగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు మత్స్య శాఖ అధికారులు, సంబంధిత అధికారులతో మంత్రి వాకటి శ్రీహరి అన్నారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు జరగకుండా వానాకాలం సీజన్‌కు సంబంధించి కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌డీవో శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య, డీఏఓ సుదర్శన్, వ్యవసాయ అధికారి రాజారత్నం, డీసీఎంఎస్ మోహన్ కృష్ణ, మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో 105 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న విజయేందర్‌రెడ్డి

రంగారెడ్డిలో ప్రజావాణికి 25 ఫిర్యాదులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 25 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్వో సంగీత ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ అర్జీల్లో రెవెన్యూకు సంబంధించి 15, ఇతర శాఖలకు సంబంధించి పది వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా చేవెళ్ల మండలం మీర్జాగూడ దగ్గర రోడ్డు ప్రమాదంలో మృతుల ఆత్మ శాంతి కోసం అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అధికారులు



చెర్లపటేల్‌గూడలో ఘనంగా సదర్

ఇబ్రహీంపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి చెర్లపటేల్‌గూడ్‌లో ఆదివారం రాత్రి మల్లికార్జునస్వామి యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనాన్ని నిర్వహించారు. రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు క్యామ మల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవ ర్గ అధ్యక్షుడు శ్రీరాం, సంఘం గ్రామాధ్యక్షుడు సంపత్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు యువత దూరంగా ఉండాలి

కందుకూరు/మాడ్గుల, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మత్తుకు దూరంగా ఉండాలని సీఐ సీతారాం అన్నారు. పోలీసు ఫ్లాగ్ డేను పురస్కరించుకొని మండల పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్‌ను కొందరు ఇతర ప్రాంతాల నుంచి రవాణా చేస్తూ స్థానిక యువతకు అలవాటు చేయడానికి యత్నిస్తారన్నారు. అలాంటి వారిని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.దీప. ప్రత్యేక అధికారి వి.మహేందర్, పోలీసు సిబ్బంది వి.రాజునాయక్, పాండురంగారెడ్డి, శేఖర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు: మాట్లాడుతున్న సీఐ సీతారాం

మాడ్గులలో..

విద్యార్థులు మారకద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను నాషనం చేసుకోవద్దని ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు అన్నారు. మాడ్గుల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నషా ముక్త్ భారత్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు సతీస్ కుమార్, రాధిక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


బస్సు ఆపాలని ధర్నా చేస్తున్న ప్రయాణికులు

బస్సులు ఆపాలంటూ ధర్నా

కొందుర్గు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు ఆపాలంటూ ప్రయాణికులు, విద్యార్థులు ధర్నాకు దిగారు. సోమవారం మండల పరిధిలోని శ్రీరంగాపూర్ శివారులో అప్పారెడ్డిగూడ గేటు వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలని, బస్సు కోసం గంటల తరబడి నిలబడాల్సి వస్తుందని విద్యార్థులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పారెడ్డిగూడ గేటు వద్ద షాద్‌నగర్, పరిగి, కొందుర్గు వైపు వచ్చే రహదారిపై పరిగి డిపో ఆర్టీసీ, అద్దె బస్సులు ఆపకపోవడంతో కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని బస్సులు ఆపాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్.. కళాశాలల బంద్

ఇబ్రహీంపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయని కారణంగా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య పిలుపు మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం పరిధిలో ప్రైవేట్ డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కళాశాలలు మూసి వేశారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డెత్ జర్నీ



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

బస్సు, టిప్పర్ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బస్సు ప్రమాదంలో ధారూరు మండలానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ధారూరుకు చెందిన విద్యార్థి నందిని, హైదరాబాద్‌లోని ఓ క్లబ్‌లో స్వీపర్‌గా పని చేస్తున్న నాగమణి, తోలుకట్ట గురుకుల పాఠశాలలో పని చేస్తున్న కేరెల్లికి చెందిన జయమ్మ బస్సులోని కంకర కుప్పలో ఇరుక్కుపోయి కాలు విరిగి గాయపడింది. కొండాపూర్ కుర్దు గ్రామానికి చెందిన విద్యార్థి జశ్వంత్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరు వివిధ అసుపత్రులలో చికిత్స పొందుతున్నారు.

(ఐదో పేజీ తరువాయి)

మాగళ్ల హనుమంతు (44), యాలాల మండలం, లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థి గుర్రాల అఖిల (23), తాండూరు వాల్మీకీ నగర్‌కు చెందిన కిష్టాపూర్ వెంకటమ్మ (21) మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఘటన స్థలంలోనే మృతి చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా(31) బషీరాబాద్ మండలం, మంతట్టి గ్రామ వాసి.

12 మంది క్షతగాత్రులు

క్షతగాత్రులు సుమయా, అబ్దుల్లా, ఆస్మా (హైదరాబాద్ కంచన్‌బాగ్), బి.ప్రవీణ, సోమయ్య (తాండూరు), బి.స్వప్న (వికారాబాద్), లక్ష్మణ్ (అప్పాజీపల్లి), తసూరా, అస్మా సయ్యద్ (హైదరాబాద్ - కిషన్‌బాగ్), షఫీ (హైదరాబాద్ - బహదూర్‌పుర)లను జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో వాహీద్(వెల్చాల్), పావని (మద్గుల్ చిట్టంపల్లి)లను చేర్పించారు. ఇదిలా ఉంటే, ఈ ప్రమాదంలో తలకు బాగా గాయమైన టిప్పర్ యజమాని లక్ష్మణ్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వికారాబాద్‌కు చెందిన అంపల్లె జయసుధ(30)కు ఎడమ పక్క ఎముకలు విరిగినట్టు వైద్యులు నిర్ధారించారు. నిమ్స్ ఆస్పత్రికి తరలించి అత్యవసర విభాగంలో చికిత్స చేశారు.

కన్నీటి పర్యంతం.. ఊహకందని విషాదం

రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలం, మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం పలు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఈ ప్రమాదంలో తమ ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలు ఊహకందని విషాదాన్ని తలుచుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. మరో గంటన్నర సేపట్లో గమ్యస్థానాలను చేరుకుంటామన్న ధీమాతో ఉన్న ప్రయాణికుల్లో 19 మందిని మృత్యుశకటంలా వచ్చిన టిప్పర్ బలిగొంది. సోమవారం ఆర్టీసీ అద్దె బస్సులో తాండూరు నుంచి బయలుదేరిన ప్రయాణికుల్లో చాలా వరకు నిద్రకు ఉపక్రమించారు. మార్గమధ్యలో ధారూరు, వికారాబాద్, మన్నెగూడల్లో ప్రయాణికులు బస్సు ఎక్కారు. మీర్జాగూడ శివారులో బస్సును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో తాండూరు ప్రాంతానికి చెందిన మూడు కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. కోలుకోలేనంతగా చితికిపోయాయి. తమ కుటుంబ సభ్యులను, పిల్లలను కోల్పోయిన బాధిత కుటుంబాలను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన ఎల్లయ్య, ఆయన భార్య, బంధువుల రోదనలు అందరినీ కలచివేశాయి. తమ ముగ్గురు కూతుళ్లను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల ఆవేదన చూసి అక్కడున్న వారంతా కన్నీటి పర్యంతమయ్యారు. అదే విధంగా ఈ ప్రమాదంలో తాండూరు పట్టణానికి చెందిన తండ్రి, కూతురుతో పాటు 40 రోజుల పసికందు ప్రాణాలు కోల్పోవడం అందరి హృదయాలను కలచివేసింది. యాలాల్ మండలం, హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు ఈ ప్రమాదంలో మృతి చెందడంతో వారి ఇద్దరు కూతుళ్లు భవానీ, శివలీలలు అనాథలుగా మారారు.

ఈ గుంతే ప్రమాదానికి కారణమా.?!



ప్రమాద స్థలంలో రోడ్డుపై గుంత

హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై మీర్జాగూడ శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం దగ్గర రోడ్డుపై ఉన్న పెద్ద గుంతే ఈ ప్రమాదానికి కారణమై ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మూలమలుపులో ఆర్టీసీ బస్సు- టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనను పరిశీలిస్తే రోడ్డుపై ఉన్న గుంతనే కారణం కావొచ్చని స్థానికులు చెబుతున్నారు. గుంతను తప్పించబోయి బస్సును ఢీకొట్టినట్లు భావిస్తున్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసుల సేవలు భేష్

రోడ్డు ప్రమాదంలో మృతులు, క్షతగ్రాత్రులకు ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అందించిన సేవలను స్థానికులు అభినందించారు. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చేవెళ్ల ఏసీపీ, సీఐ, ఇతర అధికారులు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో ఇరుకపోయినవారిని బయటకు తీశారు. కంకరలో చిక్కుకున్న మృతులు, క్షతగాత్రులను బయటకు తీశారు. బస్సులో సీట్ల రాడ్లు, సీకులను కట్ చేసి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారు ఇరుక్కపోయి ఉండి కేకలు, ఏడుపులు చేస్తుండగా జేసీబీ ఇతర యంత్రాల సహాయంతో సురక్షితంగా బయటకు తీశారు. బస్సులో ఇరుక్కపోయిన వారిని ఆలస్యం జరుగకుండా వెంటనే అంబులెన్స్‌లలో చేవెళ్ల ఏరియా అస్పత్రి, పీఎంఆర్ వైద్యశాల, వికారాబాద్‌లోని ప్రభుత్వ అస్పత్రులకు తరలించడంలో పోలీసుల సేవలను అభినందించారు.

బస్సు డ్రైవర్‌ది మంతట్టి గ్రామం



ప్రమాదానికి గురైన ఆర్టీసీ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా(45) బషీరాబాద్ మండలం మంతట్టి గ్రామం. ఆయన కుటుంబం 20 ఏళ్ల క్రితం తాండూరు పట్టణానికి వలస వచ్చింది. మొదట్లో దస్తగిరి టిప్పర్ డ్రైవర్‌గా పని చేశాడు. అతడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు పిల్లలు. పదేళ్ల క్రితం ఆర్టీసీ డ్రైవర్‌గా చేరాడు. పది రోజుల కిందట ప్రమాదానికి గురైన బస్సుకు డ్రైవర్‌గా చేరినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

దేవుడి దయతో బతికాం..





ప్రమాదం నుంచి బయటపడిన జగదీశ్, వినయ్

బస్సు ప్రమాదంలో తాండూరు మండలం వీరారెడ్డిపల్లికి చెందిన జగదీశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రస్తుతం చేవెళ్ల సమీపంలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జగదీశ్ అమ్మమ్మ వర్ధంతి కోసం ఆదివారం తాండూరుకు వచ్చి బస్సులో హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అదే విధంగా గౌతాపూర్ గ్రామానికి చెందిన బి. వినయ్ కుమార్ నగరంలోని సన్‌సిటీలో ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. సోమవారం వీధులకు హాజరయ్యేందుకు తాండూరులో మొదటి బస్సును ఎక్కగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం నుంచి దేవుడి దయతో బతికి బయటపడినట్లు వాపోయాడు.

కండక్టర్‌కు మంత్రి పరామర్శ

ప్రమాదంలో గాయపడి చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాండూరుకు చెందిన కండక్టర్ రాధను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, తదితరులు పరామర్శించారు. సంఘటనపై కండక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సార్ కూతురు పెళ్లికి వెళ్తున్న..



హైదరాబాద్‌లో మా సారు ఉంటారు. ఆయన కూతురు వివాహం 7వ తేదీన ఉంది. ఈ వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు తాండూరులో బస్సు ఎక్కిన. లారీ విపరీతమైన వేగంతో వచ్చి బస్సును ఢీకొట్టింది. లారీలో ఉన్న కంకర మీదపడడంతో మొఖం, దవడ పగిలింది. దీంతో దవడకు, కాళ్లకు కుట్లు పడ్డాయి. ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నా. ఈ విషయం మా సార్‌కు తెలియడంతో ఫోనులో పరామర్శించారు.

-ఈడిగి బస్వరాజ్, కోకట గ్రామం, యలాల (వికారాబాద్)

పని దొరికిందని వెళ్తుండగా..



నేను టైల్స్ వర్క్ చేస్తుంటాను. హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో పని దొరకడంతో అక్కడికి వెళ్లాలని తాండూరులో ఆర్టీసీ బస్సు ఎక్కాను. మరో గంటన్నరలో గమ్యానికి చేరుకోవాల్సి ఉండగా ప్రమాదం జరిగింది. కాలికి తీవ్రంగా గాయాలయ్యాయి. నేను అప్పుడప్పుడు బైక్‌పై కూడా నగరానికి వెళ్తాను. కానీ, ఈ రోజు ఉదయం బస్సు ఎక్కడమే తప్పయింది.

- అబ్దుల్ రజక్, వికారాబాద్ పట్టణం

ప్రభుత్వమే ఆదుకోవాలి



నేను హెర్బల్ లైఫ్ సంస్థలో ప్రత్యేక శిక్షణ ఇస్తుంటాను. రోజూ ఇదే బస్సులో చేవెళ్లకు వస్తుంటాను. రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం చేవెళ్ల రావడానికి బస్సులో వస్తుండగా మన్నెగూడ వద్ద ప్రమాదం జరిగింది. కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. 11 ఏళ్ల క్రితం నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు ఇద్దరు కుమారులు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- కుమ్మరి అనుసూయ, గొంగుపల్లి గ్రామం, పూడూరు(వికారాబాద్)

ప్రాణాలతో బయటపడ్డ..

వెంకటయ్య, ఏఆర్ కానిస్టేబుల్

వికారాబాద్‌లో బస్సు ఎక్కి కూర్చున్నా. మహిళ రావడంతో ఆమెకు సీటు ఇచ్చి నిలబడ్డాను. ఇంతలో ఎదురుగా లారీ వేగంగా వచ్చి బస్సు ఢీకొట్టింది. తన తలకు గాయాలయ్యాయి. ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాను.

నిరసన సెగ

ఘటన స్థలాన్ని సందర్శించేందుకు వచ్చిన మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డిలకు నిరసన సెగ తగిలింది. గత ప్రభుత్వ హయాంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల నిర్లక్ష్యం వల్లనే రోడ్డు విస్తరణకు నోచుకోలేదని, అందువల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు. ఆసుపత్రి వద్ద ప్రజాప్రతినిధులకు ఎదురుగానే మృతుల బంధువులు మీ వల్లే ఈ ప్రమాదం జరిగిందంటూ ఆరోపించారు.

రోడ్డుపై జనం ఆందోళన

ప్రమాద స్థలంలో జనం నిరసనకు దిగారు. మీర్జాగూడ, ఆలూరు, అంగడిచిట్టెంపల్లి, మన్నెగూడ, తదితర గ్రామాల ప్రజలు వందలాదిగా అక్కడికి చేరుకొని ప్రభుత్వం, అధికారుల తీరుకు నిరసనగా ఆందోళన చేపట్టారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు ఏళ్ల క్రితం మంజూరైనా ఈ రోడ్డు వెడల్పు పనులను పట్టించుకోని కారణంగానే భారీ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగానే వందలాది మంది ప్రాణాలు పోతున్నాయన్నారు. రోడ్డు విస్తరణను పట్టించుకోని నాయకులు, ఇప్పుడు పరామర్శించడానికి ఎందుకు వచ్చారని నాయకులను, అధికారులను నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని వారిని సముదాయించి నిరసనను విరమింపజేశారు. అయినా నాయకులు వెళ్లిన తర్వాత కూడా ఆందోళనను కొనసాగించారు.

మనుషుల కంటే చెట్లు ముఖ్యమా?

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మనుషల ప్రాణాల కంటే చెట్లు ముఖ్యమా అని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ విమర్శించారు. రోడ్డు ప్రమాదంపై మాట్లాడుతూ ఆర్తనాదాలతో నిండిన ఆస్పత్రి దృశ్యాలు కన్నీరు తెప్పిస్తున్నాయన్నారు. పసిబిడ్డతో సహా ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గాయపడిన వారికి వైద్య సేవలను అందించాలన్నారు. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు ఎన్‌జీటీ కేసు కారణంగా నిలిచిపోవడం బాధాకరమన్నారు.

స్పీడ్ లాక్ 70.. ఓఆర్ 70శాతం

తాండూరు ఆర్టీసీ డిపో నుంచి సోమవారం ఉదయం 4.59 గంటలకు మొదటి బస్సు హైదరాబాద్‌కు బయల్దేరింది. అక్కడ 40 మంది ప్రయాణికులు ఎక్కగా, ధారూర్‌లో ఇద్దరు దిగిపోగా, అక్కడ మరో ఇద్దరు బస్సు ఎక్కారని డీఎం సురేశ్ తెలిపారు. మీర్జాగూడ చేరుకునే సరికి బస్సు 70శాతం ఓఆర్‌తో, 70 స్పీడ్ లాక్‌తో ఉందన్నారు. హైర్ బస్సుగా నాలుగేళ్ల నుంచి తాండూరు డిపోలో నడిపిస్తున్నారు. బస్సు కండిషన్ బాగుందని, డ్రైవర్ దస్తగిరి బాబా సోమవారం ఉదయం హైదరాబాద్‌కు బయల్దేరి తిరిగి రావాల్సి ఉందని తెలిపారు. డ్రైవర్‌పై గతంలో ఎలాంటి రిమార్క్ లేదని పేర్కొన్నారు. గతంలో దస్తగిరి బాబా ఆర్టీసీ ప్రైవేటు బస్సు నడుపుతూ వికారాబాద్ వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో చాకచక్యంగా వ్యవహరించి అప్పట్లో ప్రయాణికులను కాపాడినట్లు ఆర్టీసీ ఉద్యోగులు చర్చించుకున్నారు. ప్రైవేటు డ్రైవర్ అయినప్పటికీ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షల ధ్రువపత్రం తీసుకొని విధులు అప్పగిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా చేవెళ్ల బస్సు ప్రమాదంలో తాండూర్‌కు చెందిన 13 మంది దుర్మరణం చెందినట్లు గుర్తించారు. అయితే మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తన సొంతంగా రూ. 10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

టిప్పర్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన డాక్టర్లకు సూచించారు.

ప్రమాదం ఎలా జరిగింది...!

ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత ఆరా తీశారు. వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 10 మంది ఆరోగ్య పరిస్థితి గురించి ఆమె తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు, ఆ తర్వాత పరిస్థితులపై ఆమె వారిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బంది ఉన్నారు.



పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

పరిగి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పరిగి తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు ముకుంద నాగేశ్వర్, కృష్ణ మహారాజ్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగాలతోపాటు, స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నాయకులు సురేష్, శీను, నాగేశ్, వెంకటేశ్, చంద్రయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



కావ్యశ్రీ

కీసర, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కీసర సెరినిటీ స్కూల్ విద్యార్థిని ఎంపికైంది. ఆదివారం చంపాపేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కీసర సెరినిటీ స్కూల్ విద్యార్థిని కావ్యశ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం విద్యార్థినిని అభినందించారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పరిగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌ఏపీ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈవెంట్లలో పరిగి వాకర్స్ అసోషియేషన్ సభ్యులు ప్రతిభ చాటారు. రన్నింగ్, వాకింగ్, లాంగ్‌జంప్, త్రోబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన రఘు, కె.లింగమయ్య, శ్రీనివాస్‌గౌడ్, కుమార్‌గౌడ్, రాజేందర్, శశిధర్, బిచ్చయ్యను సోమవారం ఉదయం పరిగిలోని వాకింగ్ స్థలంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంఈవో గోపాల్ మాట్లాడుతూ.. ఇక మీదట కూడా క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. వాకింగ్, యోగాతోపాటు క్రీడా ఈవెంట్లలో పాల్గొనడం ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. కార్యక్రమానికి ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ కె.లింగం, నాయకులు లక్ష్మయ్య, శంకర్‌రావు, జింకల యాదయ్య, కె.లక్ష్మీకాంత్‌రెడ్డి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరాలయంలో కార్తీక పూజలు



పూజలు చేస్తున్న ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి

వికారాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని వికారాబాద్ పట్టణంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు అభిషేకాలు చేయించారు. మహిళలు, భక్తులు ఆలయ సమీపంలో కార్తీక దీపాలను వెలిగించారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌కు మరో 55.36 ఎకరాలు

నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

దుద్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు గతంలో 1,270 ఎకరాల భూమి సేకరించారు. మరింత భూమి అవసరమని గుర్తించి మరో 55.36 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. హకీంపేట్ గ్రామ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న 195 నుంచి 205 సర్వే నంబర్ల వరకు 39 మంది రైతులకు చెందిన 32.21 ఎకరాల పట్టా భూమి, పోలెపల్లి గ్రామ పరిధిలో 815 నుంచి 817 సర్వే నంబర్ల వరకు 32 మంది రైతులకు సంబంధించిన 23.15 ఎకరాల పట్టా భూమిని సేకరించిందేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్‌లు జారీ చేశారు. ప్రభుత్వం అధికారికంగా మంగళవారం జీవో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హకీంపేట్ గ్రామంలో సేకరిస్తున్న 32.21 ఎకరాల భూమిలో పోలీస్‌స్టేషన్‌తోపాటు ఇతర కార్యాలయాలను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బస్సు బాధితులకు అండగా ఉంటాం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్ అర్బన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కంకర టిప్పర్, బస్సు ఢీకొన్న ఘోర ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 19 మంది చనిపోవడం, ఇతర ప్రయాణులు తీవ్రంగా గాయపడడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన ప్రయాణికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే శంకర్ కోరారు. చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అనాథలైన పిల్లలకు ఆర్థికసాయం

యాలాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన బందెప్ప, లక్ష్మీ దంపతుల పిల్లలకు కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు రాజేందర్ రెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయాన్ని వారి పిల్లలకు అందజేశారు. మున్ముందు వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి

గత ప్రభుత్వ వైఫల్యమే..

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ చేయకపోవడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన భూసేకరణ చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీవ్రజాప్యం చేసిందన్నారు. గత ప్రభుత్వం స్పందించి ఉంటే ఇప్పటికే రోడ్డు విస్తరణ పూర్తయ్యేదని, ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కావని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు అలైన్‌మెంట్ సైతం సరిగ్గా చెపట్టలేదని ఆరోపించారు. ముమ్మాటికి బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే నిర్లక్ష్యమన్నారు. ఇప్పటికైనా వంకరలు ఉన్న రోడ్డును చక్కగా చేసి పూర్తి చేయాలని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన రోడ్డు పనులు చేపట్టాలి

మాజీ మంత్రి సబితారెడ్డి



హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డువిస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తిచేయాలని మాజీ మంత్రి సబితారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు రోహిత్‌రెడ్డి, మహేష్‌రెడ్డిలతో కలిసి సబితారెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించారు. ప్రమాద తీరును అడిగి తెలుసుకున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రోడ్డుకు సంబంధించిన భూ సేకరణ పూర్తి చేశామన్నారు.

పనులు త్వరగా పూర్తి చేస్తాం

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

గ్రీన్‌ట్రిబ్యునల్ కోర్టులో కేసు ఉండడం కారణంగానే హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులు ఆలస్యమయ్యాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. రోడ్డు ప్రమాదం ఘటన స్థలాన్ని సందర్శించిన అనంతరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాధిత కుటుంబాలతో మాట్లాడారు. మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేవని, త్వరలోనే పనులు పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతోపాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. వైద్య, రెవెన్యూ యంత్రాంగంతో పాటు ఇతర అన్ని శాఖలను ఆయన అప్రమత్తం చేశారు. ప్రమాద బాధితులకు ప్రభుత్వం పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పారు.

పెద్ద శబ్దం వచ్చింది

శ్రీశైలం, పరిగి, ప్రత్యక్ష సాక్షి



ఆర్టీసీ బస్సు, టిప్పర్ ప్రమాదం కళ్లముందే జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు పెద్ద శబ్దం వచ్చింది. పరిగి నుంచి నేను హైదరాబాద్‌కు కారులో వస్తున్నాం. మన్నెగూడకు రాగానే ఆర్టీసీ బస్సు ముందుగా వెళ్తుంది. ఖానాపూర్ గేట్ సమిపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. సడెన్‌గా కారుకు బ్రేక్‌వేసి బయటకు వచ్చిచూడగా ఘోరం జరిగిపోయింది.

శివాలయాల్లో భక్తుల సందడి


శామీర్‌పేట శ్రీభవానిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న పూజారి


కులకచర్ల ఓంకారేశ్వర దేవాలయంలో భక్తులు


ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీరామ కల్యాణ కామేశ్వరీ నవశక్తి దేవాలయంలో..

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారంను పురస్కరించుకొని పలు శివాలయాల్లో భక్తుల సందడి నెలకొన్నది. ఉదయం శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలుచేసి కార్తీక దీపాలు వెలిగించారు. అవుశాపూర్‌లోని ఉమామహేశ్వరాలయం, అంకుశాపూర్‌లోని శ్రీ భవానీ శంకర స్పటిక లింగేశ్వరాలయంలో, ఎదులాబాద్‌లోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున ఆలయం, ప్రతాప్‌సింగారంలోని శ్రీ చంద్రమౌళీశ్వరాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కంట్లం శ్రీశైలం, కంట్ల చెన్నప్ప, ప్రదీప్, నరేష్, భక్తులు పాల్గొన్నారు.

కులకచర్ల: కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కులకచర్ల ఓంకారేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండవెల్కిచర్ల పాంబండ దేవాలయానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగించి అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పాండు శర్మ భక్తులకు శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శనం కల్పించారు.

ఘట్‌కేసర్: పోచారంలోని సర్వమంగళ సమేత స్పటిక లింగేశ్వర స్వామి ఆలయంలో, శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో, విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శివాలయం, శ్రీరామ కళ్యాణ కామేశ్వరీ నవశక్తి ఆలయంలో నిత్యం ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం శ్రీరామ కల్యాణ కామేశ్వరీ నవశక్తి ఆలయంలో శివలింగానికి బిల్వార్చన, వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, రాంచందర్‌రెడ్డి, పూజారి శివకుమార్‌శర్మ, స్థానిక మాజీ కౌన్సిలర్ బొక్క సంగీత, స్థానికులు, మహిళలు పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలో కార్తీక మాసం పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ భవానిరామ లింగేశ్వరస్వామి(శివాలయం)లో ఆలయ ప్రధానార్చకులు గడియారం మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు చేశారు. సాయంత్రం భక్తులు పెద్ద ఎత్తున కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత


లక్ష బిల్వార్చనలో శ్రీ రాచోటేశ్వర శివాచార్య మహాస్వామి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ రాచోటేశ్వర శివాచార్య మహాస్వామి అన్నారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని వీరశైవ సమాజం కొడంగల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మహాదేవ శివాలయం ఆవరణలో లక్ష బిల్వార్చన, కార్తీక మాస దీపోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. కార్తీక మాసం పర్వదినం సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున మహాదేవ శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహాల ప్రతిష్ఠాపన


ఆలయంలో ప్రతిష్ఠించిన నవగ్రహాలు

దుద్యాల: మండలంలోని హస్నాబాద్ గ్రామంలోని పెరుమాళ్ల ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నవగ్రహాల ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దాతల సహకారంతో ఆలయంలో నవగ్రహాలను ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నవగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నిర్వాసితులకు పరిహారం అందజేత


చెక్కులు అందించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిహారం అందజేశారు. 14 మందికి నష్టపరిహారంగా చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, తహసీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కీసర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని కీసర సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కీసరలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పన్యాల బుచ్చిరెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి మాధవీలత పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సు లేకుండా రోడ్లపైకి వస్తే చర్యలు

బషీరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, జీపుల డ్రైవర్లు లైసెన్సు, ఆర్సీలు, ఇన్సూరెన్స్ లేకుండా రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తప్పవని బషీరాబాద్ ఎస్ఐ నుమాన్‌అలీ హెచ్చరించారు. వాహనాల తనిఖీలో భాగంగా సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ లేని 12ఆటోలు, ఒక బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో ఇన్సూరెన్స్ లేకుండా రోడ్లపైకి తీసుకురావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలి

కొడంగల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల, గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు కోరారు. విద్యాసంస్థల తరలింపుకు నిరసనగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయానికి పోస్టుకార్డులు రాసి పోస్టుబాక్సులో వేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్‌లు ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు, మాసాని వెంకటయ్య, రమేశ్‌బాబు, డాక్టర్ నవాజ్, అంజి, మల్కప్ప, వికార్, రుక్మోద్దిన్ పాల్గొన్నారు.

ఫోర్ లేన్ల రోడ్డు నిర్మించాలి

తాండూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాండూరు - హైదరాబాద్‌కు తక్షణమే నాలుగు లేన్లతో రోడ్డు నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు విజయలక్ష్మీపండిత్ డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబ సభ్యులకు రూ.50 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అనాథలైన పిల్లల చదవు బాధ్యతను పూర్తిగా ప్రభుత్వమే తీసుకోవాలన్నారు.

48గంటల్లో రోడ్డు విస్తరణపై యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించాలి

తాండూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణపై ఏళ్లుగా చేస్తున్న నిర్లక్ష్యంతో చేవెళ్ల రోడ్డు ప్రమాదం జరిగిందని జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ ఆరోపించారు. 48 గంటల్లో రోడ్డు విస్తరణ యాక్షన్ ప్లాన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు తక్షణం రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ రహదారి విస్తరణను ప్రభుత్వం అత్యవసర ప్రాజెక్టుగా ప్రకటించాలన్నారు. క్షతగాత్రులకు రూ.25లక్షలు ప్రకటించి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని కోరారు.

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి


శామీర్‌పేట: విద్యుత్ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

శామీర్‌పేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు శామీర్‌పేట విద్యుత్ సబ్‌డివిజన్ ఏడీఈ అశోక్‌రావు తెలిపారు. శామీర్‌పేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం శామీర్‌పేట సబ్‌డివిజన్ విద్యుత్ ఏడీఈ అశోక్‌రావు ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ దినోత్సవంలో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు విచ్చేసి విద్యుత్ సమస్యలపై విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏడీఈ అశోక్‌రావు, ఏఈలు రాఘవేందర్‌రావు, వెంకటనారాయణలు స్పందిస్తూ బాధ్యతగా చొరవ తీసుకుని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సబ్‌ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పారిశ్రామిక వాడలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా పారిశ్రామిక వాడలో అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికులు వినతిపత్రాలు సమర్పించారు. లోఓల్టేజీ సమస్యలతో పాటు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వినియోగం, దాని ఆదాపై అధికారులకు వినియోగదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు, ఈడీఈ రాజమల్లేశం పాల్గొన్నారు.

బల్దియా సమస్యలు పరిష్కరించాలి


ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపేట బల్దియా పరిధిలోని 14గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.విజ్ఞేశ్వర్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం మున్సిపల్ పరిధిలోని 14 గ్రామాల కాంగ్రెస్ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీలో ప్రజల సమస్యలను అధికారులు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. మిషన్ భగీరథనీరు సరఫరా కాకపోవటంతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. గ్రామాల్లో ఉన్న బోరు బావుల్లో మోటార్లు బిగించి వాడకంలోకి తీసుకురావాలని కోరారు. వర్షాల కారణంగా గుంతల మయంగా మారిన రోడ్లను మరమ్మతు చేయించటంతో పాటు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయం పట్ల స్పందించిన కమిషనర్ తమ సిబ్బందితో సమస్యల పట్ల సర్వే చేసి తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వర్దారెడ్డి, సంజీవరావు, సాలామ్, రాములు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయొద్దు


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగారం మున్సిపల్ మాజీచైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనావాసాలకు సమీపంలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయొద్దని నాగారం మున్సిపల్ సత్యనారాయణకాలనీ, హనుమాన్‌నగర్ తదితర కాలనీల వాసులు సోమవారం ఆందోళనకు దిగారు. నాగారం మున్సిపాలిటీ రెవెన్యూ సర్వేనంబర్ 133లో సుమారు 1,600గజాల స్థలంలో మద్యందుకాణం చేసేందుకు దుకాణదారులు సమాయత్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఆందోళనకు దిగారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని నిలిపివేయాలని కోరుతూ నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి. ఆధ్వర్యంలో స్థానికులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, నాగారం మున్సిపల్ మాజీకౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నరేష్, నాయక్, పలువురు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం


జుంటివాగు ఉధృతికి మిషన్ భగీరథ పైపులు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఈ లలిత, అధికారులు

బషీరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణకు రెండు రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ సీఈ జి.లలిత సంబంధిత అధికారులను ఆదేశించారు. బషీరాబాద్-తాండూరు ప్రధానమార్గం పక్కన జుంటువాగు చెక్‌డ్యాం వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో మండల వ్యాప్తంగా 47 గ్రామాలకు 20 రోజులకు పైగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ మేరకు ఎస్ఈ ఎం.అంజనేయులు, ఈఈ చల్మారెడ్డితో కలిసి మెయిన్ పైపులైన్ ప్రాంతాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు. పైపులైన్ సమస్య పరిష్కారం కోసం అక్కడున్న అధికారులతో చర్చించారు. అనంతరం అంచనా వ్యయంతో కూడిన నివేదిక వెంటనే పంపించాలన్నారు. అంతకు ముందు రెండు రోజుల్లోగా మిషన్ భగీరథ పైపులను తాత్కాలికంగా ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. పైపులైన్ సమస్య శాశ్వత పరిష్కారానికి నిధుల మంజూరీకి ప్రభుత్వానికి రిపోర్టు పంపించనున్నట్లు సీఈ వెల్లడించారు. సీఈ వెంట డీఈఈ విజయ్‌కుమార్, ఏఈ జోయేల్, సిబ్బంది తదితరులున్నారు.

ఆటల పోటీల నిర్వహణ విజయవంతంగా చేపట్టాలి

మేడ్చల్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి జోనల్ ఆటల పోటీలను విజయవంతంగా నిర్వహించడానికి పాఠశాలల ఉపాధ్యాయులు, పీటీలు కృషిచేయాలని మేడ్చల్ మున్సిపల్ కిష్టాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత అన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆటల పోటీల నిర్వాహణకు చేపట్టాల్సిన చర్యలపై సోమవారం 11పాఠశాలల ప్రిన్సిపాల్, పీటీలతో సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నాలుగు జిల్లాల పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్‌లు, పీటీలు పాల్గొన్నారు.

చెరువు అలుగుకు మరమ్మతులు


అలుగు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దుద్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'అలుగు రాళ్ల తొలగింపు.. నీరు వృథా' అనే శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఏఈఈ శ్రీకాంత్ సోమవారం దుద్యాల మండలంలోని పోలెపల్లి చెరువును సందర్శించారు. అలుగుకు ఉన్న రాళ్లను తొలగించడంతో సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో హన్మయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్వెంచర్ క్యాంపునకు గురుకుల విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని సన్మానిస్తున్న కళాశాల వైస్‌ప్రిన్సిపాళ్లు డాక్టర్ మేఘ ప్రవంతి, డాక్టర్ చేతన

శామీర్‌పేట నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా సమితి అడ్వెంచర్ శిబిరానికి శామీర్‌పేట గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని మమత ఎంపికైనట్లు సోమవారం శామీర్‌పేట గురుకుల డిగ్రీ మహిళ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ మీడియాకు వెల్లడించారు. ఎంఎస్‌సీఎస్ గ్రూప్‌లో మూడో సంవత్సరం చదువుతున్న మమత హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో నవంబర్ 10 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు శిబిరంలో పాల్గొననున్నట్లు తెలిపారు. అక్టోబరు 27న నిర్వహించిన ప్రతిష్టాత్మకం అడ్వెంచర్ క్యాంప్ ఎంపికల్లో కఠిన స్థాయి సామర్థ్య పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మమతను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, ఇతర అధ్యాపకులు అభినందించారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

వికారాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ జేఏసీ నాయకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిసె లక్ష్మణ్ అన్నారు. బీసీ జేఏసీ నాయకులతో కలిసి సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అదే విధంగా ఖానాపూర్ గేట్ వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ వెంటనే మన్నెగూడ నుంచి అప్పా వరకు రోడ్డు పనులను వెంటనే పూర్తిచేసి రోడ్డు బాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గోపాల్, నర్సిములు, అంజయ్య, శివరాజ్ గౌడ్, శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా తులసీ కల్యాణం

వికారాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతగిరి గుట్టలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో తులసీ కల్యాణ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ప్రధానార్చకులు శేషగిరి శర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాలీ ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం

కీసర రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తుండగా ట్రాలీ ఆటో ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని ఆర్ఎల్ నగర్‌లో నివాసముంటున్న వెంకటరమణ(32) కార్తీకమాస వన భోజనాల నిమిత్తం కీసరగుట్టకు వచ్చాడు. పనినిమిత్తం తిరిగి గుట్ట నుంచి కీసరకు బైక్‌పై బయల్దేరాడు. కీసర పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న ట్రాలీ ఆటో బలంగా ఢీకొంది. దీంతో వెంకటరమణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు

కొడంగల్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం శివారులో హైద్రాబాద్-బీజాపూర్ హైవేపై సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొడంగల్ అంబేద్కర్ చౌరస్తా కాంప్లెక్సులో ఈశ్వర్ ఎలక్ట్రికల్, మోటార్ వైండింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడు తన బంధువు అయిన చిల్‌ముల్‌మైలారం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌తో కలిసి బైక్‌పై సోమవారం సొంత పనినిమిత్తం వికారాబాద్ బయల్దేరాడు. ఈ క్రమంలో రేగడిమైలారం శివారులోకి రాగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొంది. దీంతో ఈశ్వర్, శ్రీకాంత్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన వాహనదారులు 108 వాహనానికి సమాచారం అందించగా వారిని కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈశ్వర్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

రోడ్డు దాటుతుండగా వ్యక్తికి..

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి మైసమ్మగుట్ట, వందన హోటల్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన పి.ప్రసాద్ అనే వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా వస్తున్న కారు ప్రసాద్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. దీంతో అతన్ని స్థానికులు 108అంబులెన్స్‌లో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అటెండర్ వైద్యం వికటించి..

● అస్వస్థతకు గురైన ఎద్దు ● పోలీసులకు ఫిర్యాదు

ధారూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న ఎద్దుకు అటెండర్ చేసిన వైద్యం వికటించి అస్వస్థతకు గురైంది. దీంతో బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన ధారూరు పశువైద్యశాలలో సోమవారం చోటుచేసుకుంది. నాగయ్య అనే రైతుకు చెందిన ఎద్దుకు అనారోగ్యానికి గురికాగా ధారూరు పశు వైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ విధుల్లో ఉన్న అటెండర్ భీమయ్య ఎద్దును చూసి వైద్యంచేశాడు. తనకు తెలిసిన ఇంజెక్షన్‌ను తీసుకువచ్చి ఎద్దుకు ఇచ్చాడు. ఆ తర్వాత నాగయ్య ఎద్దును ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నురగలు కక్కుతూ కిందపడి అస్వస్థతకు గురైంది. విషయం తెలుసుకున్న పశువైద్యశాల ఉద్యోగి బాబురావు అస్వస్థతకు గురైన ఎద్దుకు వైద్యం అందించాడు. ఇంజెక్షన్ ఇచ్చి ఎద్దు అస్వస్థతకు కారణమైన అటెండర్ భీమయ్యపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు నాగయ్య తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం


చిట్టెమ్మ

హైదరాబాద్ సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం ఈశ్వరపురి ప్రాంతానికి చెందిన బొబ్బిలి చిట్టెమ్మ (43)కు గత కొద్దికాలంగా మానసిక స్థితి సరిగా లేదు. నవంబరు-1 శనివారం ఉదయం 6:50కి ఇంట్లోంచి బయటకు వెళ్లిన చిట్టెమ్మ కనిపించకుండా పోయింది. దీంతో ఆమె కుమారుడు బీఎస్ఎఫ్ జవాన్ శివశంకర్ కీసర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు డయల్-100, 7993975938 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేషన్ షాపుల తనిఖీ


రికార్డులు తనిఖీచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ మోక్షిత

మేడ్చల్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని రేషన్ షాపులను జిల్లా డిప్యూటీ కలెక్టర్ మోక్షిత సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, తూకం వేసే కాంటాతో పాటు బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలించారు. గోదాములో ఉన్న స్టాక్ వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రేషన్ పంపిణీ సరిగా జరుగుతుందా అని అడిగి తెలుసుకున్నారు.

కద్మూర్ శివాలయ ఉత్సవాలకు ఏర్పాట్లు

● 9న శివపార్వతుల కల్యాణం, రథోత్సవం

పూడూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పూడూరు మండలంలోని కద్మూర్ శివాలయం 21వ వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు భక్త బృందం, గ్రామస్తులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7వ తేదీ(శుక్రవారం) ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రుద్రాభిషేకం, సాయంత్రం 4గంటలకు కుంకుమార్చన, 8వ తేదీ(శనివారం) ఉదయం 6గంటలకు కుంభాభిషేకం, 9గంటలకు సామూహిక యజ్ఞం, 12.10గంటలకు ప్రవచనాలు, ప్రసంగం, 9వ తేదీ(ఆదివారం) ఉదయం 6గంటలకు స్వామివారి రథోత్సవం, ఉదయం 10.45గంటలకు స్వామివారి కల్యాణం కొనసాగుతాయని నిర్వాహకులు వివరించారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల అందజేత

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు తమ జీవన ప్రమాణ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని ఆసంఘం ఉపప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ కోరారు. పోచారం మున్సిపాలిటీ, కొరైముల, సుప్రభాత్ కాలనీలో సోమవారం సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు జీవన ప్రమాణ లైఫ్ సర్టిఫికెట్లు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సింగరేణి సంస్థకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సౌలభ్యం కోసం జీవన ప్రమాణ లైఫ్ సర్టిఫికెట్ల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు బండారి రాజయ్య, సుద్దాల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, రాజ్‌కుమార్, నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఈనెల 5 నుంచి సామాజిక తనిఖీ

కులకచర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో 15వ విడత సామాజిక తనిఖీని ఈనెల 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు గ్రామాల్లో నాలుగు విడతలుగా ఆడిట్ సిబ్బంది పరిశీలించనున్నట్లు తెలిపారు.